క్లుప్తంగా

ముందస్తు పన్ను చెల్లించండి.. రిబేటు పొందండి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు 2025–2026 సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీని పొందవచ్చని డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025–2026 సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులపై ఐదు శాతం రాయితీ కల్పించిందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నగర పరిధిలోని మూడు సర్కిళ్లలో ఉన్న క్యాష్ కౌంటర్లతోపాటు డివిజన్లలో ఉన్న సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆమె కోరారు.

నగరంలో పూడికతీత పనులు



పటమట(విజయవాడతూర్పు): నగరంలో డీసిల్టింగ్ పనులను విస్తృతంగా చేసి, వాన నీటి నిల్వలు రోడ్డుపై ఉండకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది నగరంలో డీసిల్టింగ్ పనులను సోమవారం చేశారు. సర్కిల్–1 పరిధిలో 46వ డివిజన్ ఐరన్ యార్డ్, 44వ డివిజన్ బైపాస్ రోడ్ వెంట ఉన్న డ్రెయిన్‌లో, సర్కిల్–2 పరిధిలో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నుంచి నూజివీడు రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాంతాల్లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో, సర్కిల్–3 పరిధిలో గుణదల, ఆటోనగర్ గుంటతిప్ప డ్రెయిన్‌లో సిబ్బంది పూడికతీత పనులు చేశారు.

13న వేంకటేశ్వర స్వామి కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో 13వ తేదీన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీ పద్మనాభ వివిఎల్‌సీఎస్ లిమిటెడ్ అధ్యక్షులు కుంచెం శ్రీనివాసరావు పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో 108 మంది దంపతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, పూజకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. 14వ తేదీ సాయంత్రం ఆలయం నుంచి 3వేల మందితో నగరోత్సవాన్ని నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ధ్యానంతో శారీరక, మానసిక ప్రశాంతత



కృష్ణలంక(విజయవాడతూర్పు): సహజ యోగ ధ్యానంతో ప్రతి ఒక్కరూ తమలో వివేకం, విజ్ఞానం, సత్వగుణాలను పెంపొందించుకోవచ్చని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతి పొందవచ్చని సహజయోగ ట్రస్ట్ నగర కోఆర్డినేటర్లు యర్రంశెట్టి గాంధీ, టి.రవీంద్రబాబు అన్నారు. కృష్ణలంకలో బస్టాండ్ నుంచి వారధి వరకూ పరమ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సహజయోగ ప్రచార రథయాత్ర కొనసాగింది. కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో వాకర్లకు సహజయోగ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ, రవీంద్ర బాబు మాట్లాడుతూ కుండలినీ శక్తి సత్యాన్ని అనుభూతిపరంగా మానవాళికి సునాయాసంగా మాతాజీ నిర్మలాదేవి అందించారన్నారు. అనంతరం నవభారత్ ఉన్నత పాఠశాలలో సహజయోగ ధ్యాన ప్రక్రియలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ కె.విజయలక్ష్మి, ప్రచార రథయాత్ర కోఆర్డినేటర్ ఎస్.శంకర్, ట్రస్ట్ మహిళా విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి, రథయాత్ర కృష్ణలంక సారధి పురుషోత్తపట్నం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చిన్నారి అమ్ములు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లి చేతిలో చిత్రహింసలకు గురైన మూడేళ్ల చిన్నారి అమ్ములును స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు తమ సంరక్షణలోకి తీసుకున్నారు. కలరా హాస్పటల్ కొండ ప్రాంతంలోని శ్రీరాములు ఇంటికి సోమవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు చేరుకున్నారు. ఘటన గురించి శ్రీరాములు తల్లి సుమలతను అడిగి తెలుసుకున్నారు. వంట చేస్తూ ప్రమాదవశాత్తు వంటిపై గాయాలయ్యాయని సుమలత పేర్కొన్నారు. గాయాలను పరిశీలించిన అధికారులు బాలికను తన సంరక్షణలోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని కొత్తపేట పోలీసులు పేర్కొన్నారు.

స్విచ్ వేయకుండానే షాక్!





మార్చి నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులు

- వాడకానికి రెట్టింపుగా కరెంటు బిల్లులు
- సామాన్యులపై కూటమి ప్రభుత్వం భారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాల సంగతి ఏమోగాని.. అదనంగా వడ్డిస్తున్న విద్యుత్ ఛార్జీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు. మండుతున్న ఎండల వేడికి కూలర్ వైపు కాదు కదా.. కనీసం ఇంట్లో ఫ్యాన్ వేద్దామన్నా బిల్లును చూసి భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఫ్యాన్ కంటే వేగంగా విద్యుత్ మీటర్ తిరుగుతుందని.. ఎంత బిల్లు వస్తుందోనని గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సామాన్యంగా ఇద్దరు పిల్లలు, భార్యాభర్తలున్న కుటుంబానికి గతంలో రూ.500 కరెంటు బిల్లు వస్తే మార్చి నెల అది రెట్టింపు అయ్యింది. పెరుగుతున్న ధరలు, పడిపోతున్న ఆదాయ వనరులకు తోడు ప్రభుత్వం ప్రజలకు ఇలాంటి షాక్‌లు ఇస్తే పేద, మధ్య తరగతి కుటుంబాల జీవన పరిస్థితి ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు.

బాధ వినే వారేరీ..

కొత్తపేటకు చెందిన ఓ దంపతులు జీవనోపాధి కోసం చిన్న వ్యాపారం చేసుకుంటున్నారు. వీరు షాపులో సాయంత్రం రెండు ట్యూబ్‌లైట్లు మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రతి నెలా రూ.300 లోపు కరెంటు బిల్లు వస్తుంది. మార్చి నెలకు సంబంధించి మొత్తం రూ.243లు ఉంటే అన్ని రకాల ఛార్జీలు కలుపుకొని బిల్లు మొత్తం రూ.444లు అయ్యింది. ఇక చిట్టినగర్‌కు చెందిన ఓ కుటుంబానికి ప్రతి నెలా రూ.1500 లోపు బిల్లు వస్తే మార్చి నెలకు మొత్తం రూ.2700 వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు బిల్లుల మోత తగ్గిస్తామని ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి.. తీరా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే విద్యుత్ ఛార్జీల పేరిట ప్రజలకు షాక్ ఇచ్చిందని ప్రజలు అసహనం వ్యక్తపరుస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని టీడీపీ నేతలను ఇటీవల స్థానికంగా ప్రజలు కరెంటు బిల్లులపై నిలదీస్తున్నారు. దీనిపై జనసేన, బీజేపీ నాయకులపై సైతం ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

అద్దెలో పావు వంతు.. పాత బకాయిల లొల్లి

కరెంటు బిల్లుల మోత మోగడంతో అద్దె ఇళ్లల్లో ఉండే వారి బాధ వర్ణనాతీతం. ఇంటి అద్దె నెలకు రూ.4000 ఉంటే కరెంటు బిల్లు వెయ్యికి పైగానే వస్తుందటంతో తమ వేదన ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. కొత్తగా అద్దెకు వచ్చే వారికి మార్చి నెల బిల్లులో వేస్తున్న 2022, 2023, 2025 ఎఫ్‌పీపీసీఏ ఛార్జీలు ఎవరు చెల్లించాలనే దానిపై ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గతంలో అద్దెకు ఉండి ఇల్లు ఖాళీ చేసిన వారిని ఇప్పుడు పాత బకాయిలు చెల్లించమంటే మాకేం సంబంధం లేదని సమాధానం చెబుతున్నారు. దీంతో కొత్తగా అద్దెకు వచ్చిన వారు చెల్లించమంటే ఎవరో వాడిన వాడకానికి మేం ఎందుకు చెల్లించాలని ఇంటి యజమానులను ప్రశ్నిస్తున్నారు.

అప్పు చేసి బిల్లు కడుతున్నాం..



గతంలో ఎప్పుడు రాని విధంగా కరెంటు బిల్లులు వస్తున్నాయి. దీనిపై ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. వాడిన దాని కంటే సర్‌ఛార్జీలే అధికంగా వస్తున్నాయి. పనులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇలా బిల్లులు వస్తే ఏం చేస్తాం. అప్పులు చేసి కరెంటు బిల్లులు కడుతున్నాం. – లక్ష్మీకాంతం, చిట్టినగర్

పాత పద్ధతినే కొనసాగించాలి..



బిల్లులపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. నెల పూర్తవుతుందంటే భయమేస్తుంది. ఎప్పుడు ఏ ధరలు పెరుగుతాయోనని. సర్‌ఛార్జీలను వెంటనే రద్దు చేసి ఎంత వాడితే అంతే చెల్లించేలా పాత పద్ధతిలోనే బిల్లులు ఇవ్వాలని కోరుతున్నాం. – తెరేజమ్మ, చిట్టినగర్

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అందించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు తీసుకొచ్చే ప్రతి సమస్యను అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కరించాలన్నారు. సోమవారం మొత్తం 14 ఫిర్యాదులు అందగా అందులో ప్రధానంగా పట్టణ ప్రణాళిక సంబంధించినవి 8, ఇంజినీరింగ్, రెవెన్యూకు రెండు, ప్రజారోగ్యం, ఉద్యానవనం సంబంధించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి పాదుకా పట్టాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంలో రామయ్య పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని సోమవారం అత్యంత రమణీయంగా నిర్వహించారు. శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా ఈ ఉత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు మంత్రోచ్చారణలు, భక్తుల శ్రీరామనామ స్మరణల నడుమ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరాముని పాలన యావత్ ప్రపంచానికి ఆదర్శమని అర్చకస్వాములు పేర్కొన్నారు. భగవంతుడు మానవ స్వరూపంలో జన్మించి ప్రజలకు మార్గదర్శకం చేశారని, అటువంటి రాముని గుణగణాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా వాహనోత్సవం..

శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి వాహనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా చిన్న రథంపై సీతారామ ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి వాహనోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం జరిగిన పట్టాభిషేక మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



పాదుకా పట్టాభిషేకంలో స్వామి వారు







నగరంలో వర్షం

కొన్ని రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు నగరంలో కురిసిన వర్షం ఉపశమనమిచ్చింది. సోమవారం సాయంత్రం నుంచి గాలి, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లం ప్రాంతాలు నీట మునిగాయి. కార్యాలయాలు వదిలే సమయం కావడం.. భారీ వర్షం పడటంతో వాహనచోదకులు అవస్థ పడ్డారు. అయితే కురిసిన వానకు వేసవి తాపం కొంత వరకు తగ్గిందని చెప్పొచ్చు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వైకుంఠధామంలో శాంతి హోమం



కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, బోడేపూడి అప్పారావు, కాశీరత్నం దంపతులు గ్రామస్తులు నిర్మించిన వైకుంఠధామాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివుని విగ్రహ ప్రతిష్ఠ చేసి పూజా కార్యక్రమాలు, శాంతిహోమం జరిపారు. గ్రామంలోని పురాతన శ్మశాన వాటిక అభివృద్ధి చేసి అంతిమ సంస్కారాలు ఉత్తమంగా జరగాలనే సంకల్పంతో రూ.35 లక్షలు వెచ్చించి వైకుంఠధామం నిర్మించారు. పితృకార్యాలకు నూతన భవనం, విశ్రాంతి మందిరం, ఫ్రీజర్ బాక్స్, మృతదేహాలకు చితిమంటల హాల్, ప్లాట్ ఫారమ్, నీరు, విద్యుత్ సదుపాయం, స్నానాలకు షవర్‌లు, ప్రహరీ, ఆర్చ్‌రీ, ప్రధాన గేటు, గ్రీనరీ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బోడేపూడి అప్పారావు తెలంగాణలో పారిశ్రామిక వేత్తగా స్థిరపడ్డారు. పుట్టిన ఊరికి మంచి చేయాలనే తలంపుతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నయనానందకరం.. రామయ్య రథోత్సవం



రథోత్సవంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత పోతిన వెంకట మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌లోని శ్రీనగరాల సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత కల్యాణరామున్ని విద్యుద్దీపాలంకార రథంపై అధిష్ఠింపజేసి రామనామల నడుమ భక్తులు ఊరేగించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, విచిత్ర వేషధారణలు, భక్తుల జయజయధ్వనుల మధ్య నయనానందకరంగా రాములోరి రథం ముందుకు సాగింది. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, బీసీ రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్, సీబీఐ స్పెషల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. ఈ రథోత్సవం బ్రహ్మణ వీధి ఆలయం నుంచి ప్రారంభమై నెహ్రూబొమ్మ సెంటర్, కేటీరోడ్డు, కోమలవిలాస్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, నగరాల సంఘ నేత కొరగంజి జగన్నాథపాత్రుడు తదితర ప్రముఖులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

రథోత్సవం సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి రథానికి ఇరువైపులా హారతులు పట్టారు. రథాన్ని లాగడంలో వీరంతా పోటీ పడ్డారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌శాఖ, పోలీస్ శాఖలు ప్రత్యేక బందోబస్తు చేపట్టాయి. ఏసీపీ దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



విద్యుద్దీపాలంకరణలో స్వామి వారి రథం

గాయత్రి సొసైటీ ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని గాయత్రి సొసైటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణ బాలురకు సామూహిక ఉపనయనాల కార్యక్రమం గాయత్రి సొసైటీ కల్యాణ మండపంలో సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు, ధార్మిక విద్యాధికుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని వటువులకు ఆశీస్సులు అందజేశారు. భిక్షాటన, యజ్ఞోపవీతం ధరించిన అనంతరం ఆచరించవలసిన నియమాలను వటువులకు వివరించారు.

తల్లిని మించిన దైవం, గాయత్రిని మించిన మంత్రం లేదు : మల్లాది విష్ణు

గురుముఖంగా అగ్ని కార్య సాక్షిగా చెప్పబడే మంత్రమే గాయత్రి మంత్రమని మల్లాది విష్ణు చెప్పారు. పిన్న వయసులో ఉపనయనం జరిగిన వారికి గాయత్రి మాత అనుగ్రహం పుష్కలంగా ఉంటుందన్నారు. నిత్యం గాయత్రి మంత్ర జపం అనేక సత్ఫలితాలనిస్తుందని, త్రికాల సంధ్యావందనం ద్వారా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. సంప్రదాయాలను, ప్రతి ఒక్క వటువు త్రికాల సంధ్యావందనం, గాయత్రి మంత్రోపాసనం తప్పనిసరిగా ఆచరించాలన్నారు. అప్పుడే వారి జీవన స్థితిగతులు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. ఈ సందర్భంగా త్రికాల సంధ్యావందన విశిష్టతను వివరించారు. సంధ్యావందనం సమయంలో సూర్య శక్తిని పొందేందుకు మనషికి ఉన్న శక్తి చాలదు కనుక గాయత్రి మంత్రాన్ని ఉచ్చరించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క బ్రాహ్మణుడు తన దైనందిన జీవితంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ త్రికాల సంధ్యావందనాన్ని మరువకూడదని తెలిపారు. అలాగే 16 ఏళ్ల వయసులోపే ఉపనయనాలను పూర్తి చేసుకోవాలని బ్రాహ్మణ బాలురకు మల్లాది విష్ణు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, గాయత్రి సొసైటీ చైర్మన్ గంటి ఈశ్వర్, ట్రెజరర్ జె.కె.సుబ్బారావు, చల్లా హరికుమార్, సనత్, చాంద్ శర్మ, చల్లా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక ఉపనయనాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారికి పదోన్నతులు ఇవ్వాలని, వేతనాలను పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పెద్దన్న అధ్యక్షతన విజయవాడ దాసరిభవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్‌ఏలు 21 వేల మంది సేవలందిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయాక.. తెలంగాణ రాష్ట్రంలోని వీఆర్‌ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరించారన్నారని, ఏపీలో మాత్రం జరగలేదన్నారు. చిన్నపాటి ఉద్యోగాలు, చాలీచాలని వేతనాలతో జీవనం గడిస్తున్న వీఆర్‌ఏల ఇచ్చిన డీఏలను వెనక్కి తీసుకోవడం తగదని రామకృష్ణ అన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుపల్లి రవీంద్రనాథ్, వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గణేష్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకాశి, రాష్ట్ర నాయకులు భద్రరావు, వెంకటరత్నం, వివేక్, సురేశ్ మాట్లాడారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన భవానీపురం పీఎస్ పరిధిలోని రామరాజ్యనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామరాజ్యనగర్‌కు చెందిన నామ సంగీత ఇంటర్ వరకు చదివి ఇంట్లో ఉంటోంది. ఆదివారం ఉదయం ఇంటి పనులు చేయడం లేదని తల్లి మందలించింది. తల్లి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి తిరిగి వచ్చిన తల్లి తలుపు తీసి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించింది. దీనిపై సోమవారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాపారిని మోసం చేసిన ముగ్గురిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మనీష్ మార్కెటింగ్ ఏజెన్సీ వద్ద వస్తువులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ముగ్గురు వ్యక్తులపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. హెచ్‌బీకాలనీకి చెందిన అంబాలాల్ మనీష్ మార్కెటింగ్ ఏజెన్సీ పేరుతో గృహోపకరణాల వ్యాపారం చేస్తున్నాడు. చిట్టిరెడ్డి రామకృష్ణ, తెప్పలి వెంకట్రావు, తోట ఉమామహేశ్వరరావులు సరుకులు తీసుకెళ్లి డబ్బులు తిరిగి ఇస్తూ ఉంటారు. అలా నమ్మకం కుదిరింది. ఈ నేపథ్యంలో చిట్టిరెడ్డి రామకృష్ణ రూ.80 వేలు, తెప్పలి వెంకట్రావు రూ.2 లక్షలు, తోట ఉమామహేశ్వర రావు రూ.లక్ష విలువైన సరుకు తీసుకెళ్లారు, డబ్బులు చెల్లించాలని అడిగితే వ్యాపారిని బెదిరిస్తున్నారు. దీనిపై ఏజెన్సీ నిర్వాహకుడు అంబాలాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బాడీ బిల్డింగ్ క్రీడాకారులకు సత్కారం



పెనమలూరు: రాష్ట్ర, జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బాడీ బిల్డింగ్ క్రీడాకారులను సోమవారం కానూరులో ఘనంగా సత్కరించారు. గత నెల ఒరిస్సాలో జరిగిన జాతీయ స్థాయి జూనియర్స్ బాడీ బిల్డింగ్ పోటీల్లో 60 కేజీల విభాగంలో ఎం.దినేష్ సిల్వర్ మెడల్, ఈ నెలలో భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి మెన్స్ ఫిజిక్ 165 సెంటీమీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించాడు. మరో క్రీడాకారుడు వి.శ్రీను 165 సెం.మీ విభాగంలో సిల్వర్ మెడల్ గెలిచాడు. ఈ క్రీడాకారులను అశోక్ జిమ్‌లో ప్రత్యేకంగా సత్కరించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ చైర్మన్ గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, అధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి తాళ్లూరి అశోక్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.